## ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

చేవెళ్ల, మార్చి 6 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు అన్నారు. బుధవారం చేవెళ్ల కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 31 కేసులు పరిష్కరించి.. రూ.50,500 జరిమానాలు విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై విఠల్‌రెడ్డి, ట్రాఫిక్ కానిస్టేబుల్ కవిత, శ్రీశైలం, శ్రీనివాస్, పోలీస్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



• విద్యుత్ వెలుగుల్లో మహేశ్వరం రాజరాజేశ్వరాలయం

## నేటి నుంచి మైసిగండిలో బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: కడ్తాల మండలం మైసిగండి శివరామాలయం మహశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా శ్రీ కాశీ విశ్వనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఇక్కడ అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. గురువారం నుంచి 9వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం మైసిగండి శివరామాలయాన్ని సర్వాంగ సుందరంగా, శోభాయామానంగా అలంకరించారు. మూడు రోజుల పాటు కొనసాగే మహాశివ రాత్రి ఉత్సవాలను తిలకించడానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు.

**ఉత్సవాల వివరాలు**

మైసిగండి శివాలయం బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలి, ఈఓ స్నేహలతలు వివరించారు. గురువారం విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, స్వామివారి మహన్యాసక పూర్వ రుద్రాభిషేకం, 8న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లింగోద్భవ కాలంలో శివపార్వతుల కల్యాణం, రథోత్సవం, 9న వసంతోత్సవం, అవబృతం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటు రుద్రహోమం,నవగ్రహ హోమం,గణపతి హోమం నిర్వహిస్తామని చెప్పారు.సమయానుకూలంగా ధార్మిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



### సంజీవపురం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో...

కొందుర్గు: వెంకిర్యాల శివారులోని సంజీవపురం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ తెలిపారు. ఈ నెల 7 గురువారం ఉదయం గణపతి పూజ, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, స్వామివారికి అభిషేకం, 8న ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు, అర్చన, శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దర్శనం, సాయంత్రం ఉపవాస విరమణ, రాత్రి 8 నుంచి భజన కార్యక్రమం, రాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, 9న మహానైవేద్యం, ఉదయం 6 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

# శివ పూజకు వేళాయె!

- మహేశ్వరంలో నేటినుంచి బ్రహ్మోత్సవాలు
- 9న శివ పార్వతుల కల్యాణం
- జిల్లాలోని పలు ఆలయాల్లో ముమ్మర ఏర్పాట్లు
- భారీగా హాజరు కానున్న భక్తులు

మహేశ్వరం, మార్చి 6 : శివరాత్రిని ఘనంగా జరుపుకునేందుకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. పలు ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు భారీగా భక్తులు హాజరు కానుండడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగానే కాకుండా కాకతీయుల కళాకండాలు కళ్లకుకట్టినట్లుగా కనువిందు చేసే స్థలంగా వెలుగొందుతున్న మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతీ యేటా మహాశివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 7 నుంచి 11వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. మహేశ్వరం ప్రజలే కాకుండా జిల్లా నలుమూలలు, హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఉత్సవాలకు తరలి రానున్నారు. ఆలయం ముందు ఉన్న వేప, రాగి మేడి రకాల త్రివృక్షం ఎంతో ప్రసిద్ధికి నిలయంగా మారింది.



మహేశ్వరం : ఆలయంలో కొలువుదీరిన రాజరాజేశ్వరుడు

**బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు**

మహేశ్వరం శ్రీ రాజరాజేశ్వరాలయం వద్ద ఐదు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం మహేశ్వరం, విఠాని, షాద్‌నగర్, ఫలక్‌నుమా డిపోల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేశారు.

**కార్యక్రమాలిలా..**

ఈ నెల 7 నుంచి 11 వ తేదీ వరకు కొనసాగే

### 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆరుగురు సీఐలు, 30 మంది ఎస్సైలు, 164 మంది సిబ్బందితో శ్రద్రతా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఈవో మురళీకృష్ణ, కమిటీ చైర్మన్ అల్లెకుమార్ వివరించారు. 7వ తేదీ గురువారం గణపతిపూజ, పుణ్యాహవచనము, ధ్వజారోహణం, 8వ తేదీ శుక్రవారం మహాశివరాత్రి రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, సహస్రనామార్చన, బిల్వార్చన, మంత్రపుష్పము, మంగళహారతి, తీర్థప్రసాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 9వ తేదీ శనివారం రాజరాశ్వరస్వామి వారికి రుద్రాభిషేకాలు, అమ్మవారి కుంకుమార్చన, శివపార్వతుల కల్యాణోత్సవం, 10వ తేదీ ఆదివారం స్వామి వారి రుద్రహోమం, రథోత్సవం, 11వ తేదీ సోమవారం లలిత సహస్రపారాయణం, దోపోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు



విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన కొత్తూర్ కాశీవిశ్వనాథస్వామి దేవాలయం

కొత్తూర్: మహాశివరాత్రికి కొత్తూరు మండలంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. కొత్తూరు మున్సిపాలిటీలోని శివనగర్‌లో వెలసిన శ్రీకాశీవిశ్వనాథస్వామి దేవాలయంలో ఈ నెల 8న సుప్రభాత సేవ, గణపతిపూజ, ఏకదశరుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు శివపార్వతుల కటద్యణం, పల్లకీసేవ, రాత్రి 12గంటలకు మహాలింగోద్భవ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 9న పంచామృతభిషేకం, సహస్రబిల్వార్చన అలంకరణ, మహామంగళహారతి, మంత్రపుష్పం, స్వస్తి వచనంతో ఉత్సవాలు ముగుస్తాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని కాశీవిశ్వనాథ స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు.



కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో వెలసిన శివలింగం

### కొత్తూరు మండలంలో..



మైసిగండిలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ రాములు

## తెలంగాణ అభివృద్ధికి కట్టుబడిన బీజేపీ

కడ్తాల్, మార్చి 6: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు తెలిపారు. మండలంలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని బుధవారం ఎంపీ రాములు సందర్శించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితో కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి(గురువారం) నుంచి జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాల కరపత్రాలను, పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఎంపీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మరోమారు బీజేపీ అధికారంలోకి వస్తుందని, మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు తిప్పిరెడ్డి రాంరెడ్డి, మన్యనాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీకాంత్ సింగ్, శంకర్‌నాయక్, శ్రీశైలంగౌడ్, గోపాల్‌రెడ్డి, జంగం సాయిలు ఉన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కృషి

- 'ధరణి'తో రైతులను అధోగతి పాలు చేసిన బీఆర్ఎస్
- రైతులు, అధికారులతో నిర్వహించిన సదస్సులో ధరణి ప్రక్షాళన కమిటీ సభ్యుడు కోదండరెడ్డి

కందుకూరు, మార్చి 6 : భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, దరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అధోగతి పాలు చేసి... వారిని కార్యాలయాల చుట్టూ తిరిగేలా చేసిందని ధరణి ప్రక్షాళన రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కందుకూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రైతులు, అధికారులతో నిర్వహించిన సదస్సులో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్), పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత రెండు సంవత్సరాలుగా మండల పరిధిలోని రైతులు భూ సమస్యలపై ఎన్ని ధరఖాస్తులు చేసుకున్నారని తహసీల్దార్ కె.గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని, ఇందులో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదన్నారు. ఈనెల 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న ధరణి స్పెషల్ డ్రైవ్ నిరంతరాయంగా కొనసాగుతున్నట్లు తెలిపారు.



సదస్సులో పాల్గొన్న కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

గతంలో ఈ మండలం నుంచి 2,536 మంది రైతులు వివిధ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు ధరఖాస్తు చేసుకున్నారని, వాటిని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. వీటితో పాటు రైతుల సమస్యలపై కొత్తగా తెల్లకాగితంపై తహసీల్దార్‌కు ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. భూ సమస్యలను పరిష్కరించే అధికారం తహసీల్దార్, ఆర్డీవోలకు అప్పగించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పట్టా, భూదాన్, సీలింగ్, ప్రభుత్వ, వక్ఫ్ భూములకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి భూమిని కేటాయించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణి పేరును మార్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 2017 డిసెంబరులో ప్రారంభమైన ధరణి పార్ట్ ఏ, పార్టు బీ ద్వారా రెవెన్యూ అధికారులు రైతుల భూ వివరాలు రికార్డుల్లో ఎక్కించారని,పార్ట్ ఏలో 2018 నుంచి 2023 వరకు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి.. పార్ట్ బీలో రాష్ట్రవ్యాప్తంగా 18లక్షల ఎకరాలకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి హక్కులు కల్పించలేదన్నారు. దాంతో రైతు బంధు, పంటరుణం తీసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి సివిల్ కోర్టులో ఉన్న కేసులకు సంబంధించి ప్రత్యేకంగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పదేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో భూములను సర్వే చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందన్నారు. కానీ, మన రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు వాటి ఎలాంటి సర్వేలు చేయకుండా కాలయాపన చేసిందని గుర్తుచేశారు. సమావేశంలో తహసీల్దార్ కె.గోపాల్, ఉప తహసీల్దార్ తాజుద్దీన్, నాయకులు కృష్ణానాయక్, అప్జల్‌బేగ్, గంగుల ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, జగన్, రాణాప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, వెంకట్‌రాంరెడ్డి, మధన్‌పాల్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, యుగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

# పరీక్షల్లో దస్తూరీ కీలకమే!

- విద్యార్థులు చేతి రాతపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు
- ఈనెల 18వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు

చేవెళ్ల, మార్చి 6: పదో తరగతి ప్రతీ విద్యార్థి భవిష్యత్తుకు కీలకం. ఈ నెల 18వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో వచ్చే గ్రేడింగ్ విద్యార్థి ఉన్నత చదువుకు ప్రామాణికం. ఇలాంటి కీలకమైన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థి చేతి రాత కూడా మార్కులను ప్రభావితం చేస్తుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. చక్కనైన చేతి రాత ఉంటే మరిన్ని ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. సమాధానాలు బాగానే రాసినా ఆకుట్టుకునే దస్తూరి ఉంటే మరింత ఉత్తమ ఫలితం ఉంటుందన్నారు. విద్యార్థుల పేపర్లు మూల్యాంకనం చేసే వారికి సులభంగా అర్థమయ్యేలా ఉంటే ఎక్కువ మార్కులు వేస్తారు. పరీక్షల సమయంలో సహజంగానే విద్యార్థుల్లో కొంత ఒత్తిడి ఉంటుంది. మొదటి ప్రశ్నకు జవాబు చక్కనైన చేతిరాతతో రాసి చివరి ప్రశ్నలకు వేగంగా రాస్తే హ్యాండ్ రైటింగ్ బాగ లేకుంటే మార్కులు తగ్గే ఆస్కారం ఉంది. దీన్ని అధిగమించేందుకు విద్యార్థులు చక్కటి దుస్తూరిపైనా దృష్టి పెట్టాలి.



చేవెళ్లలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

**ఈ జాగ్రత్తలు తప్పక పాటించాలి**

- జవాబు పత్రానికి పై భాగంలో ఒక ఇంచ్, అలాగే ఎడవ వైపు మరో ఇంచ్ మార్జిన్ వదలాలి.
- సమాధానాలు సూటిగా, అక్షరాలు పొందికగా ఉండాలి. ముత్యాల్లాంటి అక్షరాలుంలే మూల్యాంకనం చేసే వారు ఒకటి, రెండు మార్కులు ఎక్కువ వేస్తారు.
- ప్రతీ పేజీలో 16 నుంచి 20 లైన్లకు మించి రాయొద్దు.
- లైన్లు వంకర పోకుండా చూసుకోవాలి.
- రాస్తున్నపుడు పెన్ను గ్రిప్‌ను సక్రమంగా పట్టుకోవాలి. ఇలా చేస్తే అక్షరాలు గుండ్రంగా ఉంటాయి.
- సామాన్య, భౌతిక శాస్త్రాల్లో బొమ్మలు గీసేప్పుడు పెన్ను, లేదా పెన్సిల్‌ను గట్టిగా నొక్కిపెట్టి రాయొద్దు. అలా చేస్తే పేపర్ పాడవుతుంది.
- అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ(స్పేస్) ఉంచాలి.
- రోజూ చదివింది రాస్తే రాత అలవాటై హ్యాండ్ రైటింగ్ మెరుగవుతుంది. అలాగే చదివింది ఎక్కువ రోజులు గుర్తుంటుంది.



### చేతిరాతకు ఉన్న ప్రాధాన్యం తగ్గదు

శాస్త్రసాంకేతిక పరంగా ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం ఉన్న తగ్గదు. దస్తూరి బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు పొందేందుకు అవకాశం ఉంది. విద్యార్థులు చేతిరాతపై దృష్టిపెట్టి పరీక్షల్లో జవాబులను ముత్యాల్లాంటి అక్షరాలతో రాస్తే మూల్యంకనం చేసే వ్యక్తి ఎక్కువ మార్కులు వేస్తారు. ప్రతీ విద్యార్థి అందమైన హ్యాండ్ రైటింగ్ ఉండేలా రోజూ ప్రాక్టీస్ చేయాలి.

సురధీర్, ఎస్ఏ, సోషల్ సైన్సెస్, కమ్మెట

# నేటి బాలలే రేపటి పౌరులు

- జిల్లా కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి రంగారెడ్డి అర్బన్, మార్చి 6 : నేటి బాలలే రేపటి పౌరులు అని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల రక్షణకు అన్ని శాఖల సమన్వయం అవసరమన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, అక్రమ రవాణా, మిస్సింగ్ వంటి సమస్యలతో బాధపడే పిల్లలకు రక్షణ కల్పించడం కోసం అందరూ సహకరించాలని సూచించారు. ప్రతీ గ్రామం, మండలం, జిల్లా స్థాయి కమిటీలు నిరంతరం పని చేయాలని సూచించారు. చట్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బడీడు పిల్లలందరూ బడికి వెళ్లేలా చూడాలన్నారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పిల్లల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. బాల కార్మిక వ్యవస్థ, దత్తత, పిల్లల లైంగిక నేరాలు, మత్తు పదార్థాల నియంత్రణ తదితర అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరీ దేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

### చెరువులు కబ్జా కాకుండా చూడాలి

జిల్లాలోని చెరువులను కబ్జాలకు గురికాకుండా చూడాలని ఇరిగేషన్ ఎస్ఈని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించిన ఆర్డీవో, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో చెరువులు కబ్జాలకు గురికాకుండా ఎఫ్‌టీఐలను గుర్తించాలని, అక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత కూడా మనపైనే ఉందన్నారు. చెరువులను జాయింట్ సర్వే నిర్వహించి ఎఫ్‌టీఐలను, బఫర్లను గుర్తిస్తూ కడ్డీలను, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల కబ్జాలను అరికట్టవచ్చన్నారు. చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. భూములకు సంబంధించి అనాథథరైజ్డ్ లే అవుట్ల జాబితాను తయారు చేయాలని, ప్రభుత్వ భూములను ఆక్రమణకు గురికాకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి, తహశీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

**రాజీనామా**

తాండూరు, మార్చి 6: బీఆర్ఎస్ తాండూరు మహిళా విభాగం అధ్యక్షురాలు జి.పరిమళ ఆ పార్టీ, పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్‌కు రాజీనామా లేఖను పంపించారు

## ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

దోమ, మార్చి 6: రైతులకు ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని గూడూరు గ్రామంలో బుధవారం ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రావు, ఏఈవోలు పాల్గొన్నారు.


గూడూరులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తనిఖీ

## ముదిరాజ్ మండల కమిటీలు వేయాలి

వికారాబాద్, మార్చి 6: ప్రతీ మండలంలో ముదిరాజ్ మండల కమిటీలు వేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.వీరప్ప ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బని బసయ్య ముదిరాజ్ కోరారు. జిల్లాలోని మండలాల ముదిరాజ్, కన్వీనర్లు బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మైపాల్, అంబదాసు, అశోక్, కృష్ణ, జర్నప్ప, రాములు, తిరుపతి పాల్గొన్నారు.


ముదిరాజ్ సంఘం సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు

# ఉద్యోగులకు బదిలీలు సహజం


డీఎస్పీ అంజయ్యను శాలువాతో సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మార్చి 6 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళుతున్న వికారాబాద్ డీఎస్పీ పనిచేసిన అంజయ్య, కొడంగల్ సీఐగా పనిచేసిన రాములు, ఐటీసీటీ ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన రవికుమార్‌లను బుధవారం ఎస్పీ ఆయన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన పోలీసు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేసి పోలీసు వ్యవస్థకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

# తాగునీటి సమస్యలు రానివ్వద్దు : ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

మాడ్గుల, మార్చి 6 : గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్యదర్శులు, ప్రత్యేక అధికారులకు ఎంపీపీ గౌరవరం పద్మ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి, పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పాండుగౌడ్, గ్యార వెంకటయ్య, నారమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో సరస్వతి, పీఆర్‌డీఈ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ఏఈ సూర్యవంశీ, విద్యుత్తు ఏఈ శ్రీనివాస్, ఏవో గౌతం, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అంతరించిపోతున్న కళలను పరిరక్షించాలి

ఆమనగల్లు, మార్చి 6: అంతరించిన పోతున్న గ్రామీణ కళలు, కళారూపాలను పరిరక్షించాలని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆ కళాకారులకు ప్రభుత్వాలు చేయూతనందించి ప్రోత్సహించాలని కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీలక్ష్మీనర్సింహా స్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. కళాకారులకు ప్రోత్సాహకంగా రూ.10 వేలు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, నిర్వాహకుడు నారాయణ, ఎంపీటీసీ అంబాజీ, నాయకులు బాలకృష్ణ, అజీజ్, విష్ణువర్ధన్ యాదవ్, పెంటయ్యగౌడ్, శ్రీరామ్, లింగం, కృష్ణయ్య, పాల్గొన్నారు.



# మహిళగా జన్మించడం అదృష్టం : గవర్నర్


మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

జవహర్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళగా జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్‌పిలానీ-హైదరాబాద్ క్యాంపస్‌లో రాచకొండ పోలీస్ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గవర్నర్ హాజరై జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. మహిళలను గౌరవించే ఏ దేశమైన అభివృద్ధి చెందుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. జీవితంలో మహిళలు ఒక తల్లిగా, సోదరిగా, భార్యగా, స్నేహితురాలిగా ఎన్నో పాత్రలు పోషిస్తున్నారని మహిళల్లో నిబద్ధత ఎక్కువని అభిప్రాయపడ్డారు. తన జీవితంలో రంగు, ఎత్తు, ప్రతిభను ప్రదర్శించడంలో ఎదురైన అనుభవాలను వివరించారు. తెలంగాణతో పాటు పుదుచ్చేరిలో గవర్నర్‌గా అవకాశమిస్తే రెండు చోట్ల సమర్థవంతంగా బాధ్యతలు నెరవేరుస్తున్నానని, ఒక గైనకాలజిస్టుగా పిల్లలను ఎలా పెంచాలో తెలుసని ఆమె అన్నారు. అదేవిధంగా మహిళలు కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని గవర్నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ సీపీ తరుణ్‌జోషి, పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఐపీఎస్ అభిలాష బిస్త్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, అడ్మిన్ డీసీపీ ఇందిర, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషావిశ్వనాథ్, బ్యాండ్మింటన్ క్రీడాకారిణి సైనానెహ్వాల్, బాలీవుడ్ నటి తనాజ్ ఇరానీ, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి, జవహర్‌నగర్ సీఐ నాగరాజు, డీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే దేశాభివృద్ధి : ఈటల


రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 6 : బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని ఎదులాబాద్, ఘణపురం, ప్రతాప్‌సింగారం గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ఈటల సమక్షంలో శామీర్‌పేటలోని ఆయన నివాసంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్నివర్గాల అభ్యున్నతే బీజేపీ లక్ష్యమని తెలిపారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఫిర్ ఏక్‌బార్ మోదీ సర్కార్ రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కంట్లం చెన్నప్ప, ఎర్రోళ్ళ మురళి, సుంకరి బాబు, జనార్ధన్, మహేష్, నాగరాజ్, ప్రభాకర్, భాస్కర్, వికాస్, ధీరజ్ తదితరులు బీజేపీలో చేరగా, బీజేపీ మండల కార్యదర్శి ప్రభంజన్‌గౌడ్, రాచకట్ల శ్రీశైలం, నాయకులు దామోదర్‌రెడ్డి, ఎర్రోళ్ళ కుమారస్వామి, మల్లేష్, భాస్కర్‌గౌడ్, రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పోలోలో అమెరికా చేతిలో భారత్ ఓటమి



గోల్ కోసం పోటీపడుతున్న జట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాధా టీఎంటీ అంతర్జాతీయ పోలో చాంపియన్‌షిప్ మూడోరోజు పోటీల్లో అమెరికా చేతిలో భారత్ పరాజయం పాలైంది. మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ హెచ్‌పీఆర్‌సీలో జరుగుతున్న ఈ పోటీల్లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో అమెరికా 10-6తో భారత్ జట్టుపై నెగ్గింది. అంతర్జాతీయ పోలో పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇస్తుండడం, ఇందులో తాము భాగస్వాములైనందుకు సంతోషంగా ఉందని రాధా టీఎంటీ చైర్మన్ సునీల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పోటీలు ఈనెల 10వ తేదీ వరకు జరగనున్నాయి.

# పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

- డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మార్చి 6: అసెంబ్లీ ఎన్నికల్లో పట్టుదలతోనే పని చేసిన విధంగానే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పార్టీ గెలుపునకు కృషిచేయాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం పరిగిలో జరిగిన నియోజకవర్గస్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఐదు నెలల వరకు కనీసం క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంతోపాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు 24 గంటలూ పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రప్రథమంగా ప్రతీ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యకర్తలకు పనితోపాటు, ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు సంపూర్ణంగా అమలు చేస్తామన్నారు. ఈనెల 11 నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడతామని, ప్రతీ నియోజవర్గానికి మొదటి దశలోనే 3500 ఇళ్ళు నిర్మించబోతున్నామని కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా గెలిపించేందుకు ఇప్పటినుంచే పని చేయాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఇమడలేకనే కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ తీసుకోచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. వందరోజుల పాలనలో అన్ని హామీలను నేరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. గత ప్రభుత్వం జిల్లా అభివృద్ధిని విస్మరించిందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అనేకమార్లు అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని, అందుకే పార్టీలో చేరామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన ఇందిరమ్మ కమిటీల ద్వారా సంక్షేమ పథకాలతో లబ్ది చేకూర్చే నిర్ణయం చాలా మంచిదన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు భీంరెడ్డి, లాల్ కృష్ణప్రసాద్, కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి హన్మంత్, ఆనందం, జింకల యాదయ్య, కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్,గండీడ్, మహ్మదాబాద్ మండలాల పార్టీ అధ్యక్షులు బి.పరుశరాం రెడ్డి, సురేందర్, విజయ్‌కుమార్‌రెడ్డి, బీఎస్ ఆంజనేయులు, కేఎం నారాయణ, పి.నర్సింహారావు, ఎ.అశోక్‌కుమార్, పరిగి పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, నాయకులు డి.మాణిక్యం, ఆనెం ఆంజనేయులు, ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'గాంధీ'లో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స

- ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసిన వైద్యబృందం

అడ్డగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రి చరిత్రలో ఎనిమిదేళ్ల చిన్నారికి చిన్నపిల్లల వైద్యుల బృందం శస్త్ర చికిత్స చేసి విజయం సాధించారు. చిన్నపిల్లల విభాగంతో హెచ్‌వోడీ ప్రొఫెసర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి బైరాంగూడకు చెందిన మైథిలి(8) కొంత కాలంగా దగ్గు, తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. వ్యాధి ఎంతకూ తగ్గకపోవడంతో ఈనెల 1న కుటుంబ సభ్యులు గాంధీలో చేర్పించారు. చిన్నపిల్లల విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ నాగార్జున వెంటనే స్పందించారు. చిన్నారి ఎమ్మారైలో బ్రాంకో జెనిక్ సిస్ట్ వ్యాధి ఉన్నట్లు మొదటగా నిర్ధారణకు వచ్చారు. బ్రోంకో జెనిక్ తిత్తి అనేది అరుదైన సెప్టిక్ గాయం లాంటిదని వారు తెలిపారు. కాగా, అది క్రమంగా బ్రోంకోజెనిక్ తిత్తి పెరుగుతుందే తప్పా.. తగ్గదని భావించామని అన్నారు. చిన్నారిలో శ్వాసనాళం, ఛాతిలోని రక్తనాళాళ మధ్య శ్వాసనాళానికి దగ్గరగా కుడి ప్రధాన శ్వాసనాళం ప్రాంతంలో బ్రోంకోజెనిక్‌తో బాధపడుతుందని వైద్యులు నిర్ధారించారు. సూపరింటెండెంట్, ప్రొఫెసర్ రాజారావుతో పాటు గాంధీ చిన్నపిల్లల వైద్యులు శస్త్ర చికిత్సలో పాల్గొన్నారు.

# అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

వికారాబాద్, మార్చి 6 : 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని, నాయకులు, రాజకీయ ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఓటరు ముసాయిదా తుది జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ముసాయిదాను విడుదల చేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 1400 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలులేవని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోదల్చిన వారు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత కార్డు స్థానంలో నూతన కార్డు పొందేందుకు అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకున్నట్లయితే పోస్టల్ ద్వారా కలర్‌తో కూడిన ఎపిక్ కార్డును పొందవచ్చని తెలిపారు. జిల్లాలో తుది చివరి ప్రచురణలో 9,84,068 మంది ఓటర్లున్నారని, ఇందులో 4,86,109 మంది పురుషులు, 4,97,920 మంది స్త్రీ ఓటర్లతో పాటు 39 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. పరిగి నియోజకవర్గంలో 2,66,273 మంది ఓటర్లకుగాను 1,33,625, మంది పురుషులు, 1,32,639 మంది స్త్రీలు, 9 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లు ఉన్నారన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,31,679 మంది ఓటర్లు నమోదు కాగా.. 1,15019 మంది పురుషులు, 1,16,647 మంది స్త్రీలు, 13 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని చెప్పారు. తాండూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,43,849 ఉండగా 1,18,228 మంది పురుషులు, 1,25,614 మంది స్త్రీలు, ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. అదే విధంగా కొడంగల్ నియోజకవర్గంలో 2,42,267 మంది ఓటర్లలో 1,19,237 పురుష ఓటర్లు కాగా, 1,23,020 మంది స్త్రీ ఓటర్లతో పాటు 10 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నిక ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందన్నారు. ఎన్నికల విభాగం తహసీల్దార్ నర్సింహారెడ్డి తదితరులున్నారు.

## శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో నమ్రత సందడి



శంకర్‌పల్లి, మార్చి 6 : సినీనటి, మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ బుధవారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో సంద డి చేశారు. మండల పరిధిలోని గోపు లారం రెవెన్యూ పరిధిలో రెండున్నర ఎకరాల భూమిని నమ్రత కొనుగోలు చేశారు. భూమి రిజిస్ట్రేషన్ నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ సురేందర్ సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రెండుగంటల పాటు నమ్రత అక్కడే ఉండటంతో ఆమెను చూసేందుకు మహేశ్‌బాబు అభిమానులు వచ్చి ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

# భూ సమస్యల పరిష్కారానికే 'స్పెషల్ డ్రైవ్'


మోమిన్‌పేట్ : రికార్డులను పరిశీలిస్తున్న లింగ్యానాయక్

మర్పల్లి, మార్చి 6: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ధరణి స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం మర్పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ధరణి పెండింగ్ సమస్యలపై రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులపై అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

మోమిన్‌పేట్ : ధరణిలో భాగంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేసారం గ్రామంలో భూ సమస్యలు ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన దరఖాస్తులు తదితర అంశాలపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 9 వరకు మండల కేంద్రాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండటంతో అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మీ సేవలో ధరణి దరఖాస్తులు, పెండింగ్ మ్యుటేషన్, విరాసత్‌లు, డీఎస్ పెండింగ్, పేరు మార్పులు, చేర్పులు, సర్వే నెంబర్లు ఎక్కువ, తక్కువ ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్ జగన్‌యాదవ్, సర్వేయర్ గౌస్‌బాషా, రాందాస్, జూనియర్ అసిస్టెంట్లుఉన్నారు.


ఘట్‌కేసర్ రూరల్ : మాట్లాడుతున్న విజేందర్‌రెడ్డి

### నిర్ణీత గడువులోగా భూ సమస్యలు పరిష్కరించాలి

ఘట్‌కేసర్ రూరల్ : ధరణి స్పెషల్ డ్రైవ్ కింద రైతుల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులకు సంబంధించి సమస్యలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణిపై నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్‌లో నిర్దేశిత సమయంలో ధరణి మాడ్యూల్స్ ప్రకారమే చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ డీఎస్ రజిని, డీటీ సందీప్‌రెడ్డి, ఆర్ఐలు పద్మనాభచారి, సాయిరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో భారీగా చేరికలు


దామోదర్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, మార్చి 6 : నియోజకవర్గ పరిధిలోని కొందుర్గు, చౌదరిగూడ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులతో పాటు కొందుర్గు మండల సింగిల్‌విండో చైర్మన్ చిట్టెం దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు బుధవారం మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వీర్లపల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి ఎంతోమంది నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేద్దామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కలిసికట్టుగా క్షేత్రస్థాయిలో పని చేస్తామని చెప్పారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు

# భూకైలాస్ ఆలయం ముస్తాబు

- సొరంగమార్గం ద్వారా జ్యోతిర్లింగాల దర్శనం
- నూతనంగా 18 శక్తిపీఠాల ఏర్పాటు
- శనైశ్చర, రేణుకా ఎల్లమ్మ, బుద్ధ విగ్రహాల ప్రతిష్ఠాపన
- ఈనెల నేటి నుంచి 10 వరకు బ్రహ్మోత్సవాలు


అంతారంతండాలోని భూకైలాస్ దేవాలయం

తాండూరు రూరల్, మార్చి 6 : తాండూరు మండలం అంతారం తండాలో అద్భుతంగా నిర్మించిన భూ కైలాస్ దేవాలయం స్వర్గధామంగా విరాజిల్లుతోంది. ఇక్కడి అందాలను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారు. భక్తి పారవశ్యంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఎంతగానో ఆకర్షిస్తుంది. అంతారం తండాలోని 10 ఎకరాల విస్తీర్ణంలో కోట్ల రూపాయలతో భూకైలాస్ దేవాలయాన్ని తండాకు చెందిన సేవ్యానాయక్(కీర్తిశేషులు) వంశం జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆల్ ఇండియా బంజారా యూనియన్ ప్రతినిధులు వాసుపవార్ నాయక్, శంకర్‌నాయక్‌లు ఆలయాన్ని నిర్మించారు. అందమైన గుడి గోపురాలు, మైమరిపించే బృందావనం సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. హైదరాబాద్‌తోపాటు జిల్లాలోని నలుమూలల నుంచి అనేక మంది భూకైలాస్‌కు తరలి వస్తున్నారు. ఈనెల 8వ తేదీన జరిగే మహాశివరాత్రికి ఇక్కడ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. నెల రోజులుగా వాసుపవార్ నాయక్ అక్కడే ఉండి నూతనంగా 18 శక్తి పీఠాలు, నవగ్రహాల ప్రతిష్ఠాపన, శనైశ్చర, రేణుకా ఎల్లమ్మ విగ్రహాలు, కోనేరులో బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 7న రుద్రహోమం, 8న రుద్రాభిషేకం, చండీయాగం, అగ్నిగుండ ప్రవేశం, బోనాల ఊరేగింపు, పల్లకిసేవా, 9న ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం, 10న ముగింపు కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారికి నైవేద్యాలు, తీర్థ ప్రసాదాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్ ఈ సందర్భంగా తెలిపారు.

### ఒకేచోట జ్యోతిర్లింగాల ఏర్పాటు

దేశంలో అత్యంత పవిత్రమై ద్వాదశ జ్యోతిర్లింగాలు భూకైలాస్‌లో దర్శనమిస్తాయి. సొరంగ మార్గం ద్వారా నీటిలో ముందుకు సాగుతూ ఒక్కో లింగాన్ని దర్శించుకునేలా వీలు కల్పించారు. నడుము మట్టం నీటిలో ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకోవడం మధురానుభూతినిస్తుందని ఇక్కడికి వచ్చే భక్తులు పేర్కొంటున్నారు.

### 65 అడుగుల శివుడి విగ్రహం

భూకైలాస్ ఆలయానికి 65 అడుగుల శివుడి విగ్రహం తలమానికమైంది. కళాకారులు ఎంతో శ్రమించి భారీ ఎత్తున విగ్రహాన్ని చెక్కారు. భూకైలాస్‌కు వచ్చే భక్తులు భారీ శివుని విగ్రహం చూసి ఆశ్చర్యపోతున్నారు. అదేవిధంగా భూకైలాస్‌లో హిందువులు పూజించే దేవుళ్లను ప్రతిష్ఠించారు. అంబా భవానీ, సేవాలాల్ మహరాజ్ ఆలయం, కాళీమాత మందిరం, వేంకటేశ్వరస్వామి, నవగ్రహాలు, వినాయకుడు, సాయిబాబా తదితర దేవతా మూర్తులను ఇక్కడ దర్శించుకోవచ్చు. అదేవిధంగా నిరంతరం మండే అగ్నిగుండంను అంబా భవానీ, సేవాలాల్ దేవాలయం ముందు ఏర్పాటు చేశారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి నేటి వరకు నిరంతరంగా అగ్నిగుండం వెలుగుతూనే ఉండటం మరో విశేషం. అలాగే భక్తులకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. ఆలయంలో నూతనంగా 18శక్తి పీఠాలతోపాటు నవగ్రహాలు, శనైశ్చరుడు, రేణుకా ఎల్లమ్మ దేవతా విగ్రహం ముందు పాదాలు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా అమ్మవారి విగ్రహం ఎదుట మూడు త్రిశూలాలు ఏర్పాటు చేశారు. భక్తులు మనస్సులో కోరిక కోరుకుని గాజు వేస్తే అది త్రిశూలానికి పడితే వారి కోరిక తీరుతుందని ప్రగాఢంగా నమ్ముతారు.


ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన శక్తిపీఠాలు

### బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం



ఆలయంలో కొత్తగా మరిన్ని దేవతల విగ్రహాలను ఏర్పాటు చేశాం. మహా శివరాత్రి సందర్భంగా నాలుగు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాం. భక్తుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. శివుడి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. ఈసారి పెద్దఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉంది.

\- వాసుపవార్ నాయక్, ఆలయ వ్యవస్థాపకులు

## పీర్ల మాన్యం కాపాడాలని వినతి

ఆమనగల్లు, మార్చి 6 : ఆమనగల్లు పట్టణంతో పాటు ముర్తూజపల్లి గ్రామ శివారులో ఉన్న పీర్ల మాన్యం భూములను కాపాడాలని ఎండి. ఫక్రుద్దీన్ మూసమియా వారసులు కోరారు. బుధవారం తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంతకు వినతిపత్రాలు అందజేశారు. విలువైన పీర్ల మాన్యం భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ తాతల కాలం నుంచి ఆ భూమి పీర్లమాన్యంగా కొనసాగుతోందని చెప్పారు. మోయినుద్దీన్, గౌసుద్దీన్, షక్రుద్దీన్, మోహియుద్దీన్, షర్ఫోద్దీన్, పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



బి. కాంతారెడ్డి

షాబాద్, మార్చి 6 : శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తానని షాబాద్ ఇన్‌స్పెక్టర్ బి. కాంతారెడ్డి అన్నారు. నార్సింగ్ ట్రాఫిక్ పీఎస్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై షాబాద్‌కు వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన యాదయ్యగౌడ్‌ను జీనోమ్ వ్యాలీ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కాంతారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## ధర్నాకు తరలిన పాడిరైతులు

కడ్తాల్, మార్చి 6 : రెండు నెలలుగా పాల బిల్లులు, మూడేళ్లుగా రూ.4 ప్రోత్సాహక నగదును చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం హైదరాబాద్ లాలాపేట విజయ డెయిరి వద్ద నిర్వహించిన ధర్నాకు కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని పాలసేకరణ కేంద్రాల అధ్యక్షులు, పాడి రైతులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కడారి రామకృష్ణ, చేగూరి వెంకటేశ్, ప్రశాంత్, సుధాకర్ రెడ్డి, నర్సింహ్మరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

## గ్రామాల్లో మొక్కల పెంపకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



పరిశీలిస్తున్న ఎంపీడీవో సరిత

కందుకూరు, మార్చి 6 : గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎంపీడీవో సరిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండలంలోని దెబ్బడగూడ గ్రామంలో నర్సరీని తనిఖీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు

## ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరిస్తాం



బస్సును ప్రారంభించిన కేఎల్లార్, జంగారెడ్డి

కందుకూరు, మార్చి 6 : కరోనా నుంచి గత ప్రభుత్వం పలు గ్రామాలకు రద్దు చేసిన బస్సులను కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డిలు తెలిపారు. బుధవారం మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో బస్సును ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామానికి ఏడాదిగా బస్సు సౌకర్యాన్ని రద్దు చేయడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇందిరదేవేందర్, నాయకులు యుగేందర్‌గౌడ్, శేఖర్, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి : ఎంపీపీ

శంషాబాద్ రూరల్, మార్చి 6 : మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ జయమ్మ అన్నారు. శంషాబాద్‌లోని షాబాద్ రోడ్డు నుంచి కచ్చేరి వరకు రూ.15లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భడ్రైనేజీ నిర్మాణానికి పరిశీలన చేశారు. ఎమ్మెల్యే సహకారంతో మండలానికి అధికంగా నిధులు తీసుకొస్తానని ఎంపీపీ చెప్పారు. పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నీరటి రాజు తదితరులు ఉన్నారు.

## సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఐని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 6 : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ కోరారు. నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మాజీ జడ్పీటీసీ, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తెల్గమల్ల జగన్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు కృష్ణనాయక్, ఫరీద్, అలీం, వస్పుల శ్రీశైలం, ఖాదర్, మహేశ్, ఉన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

ఆమనగల్లు, మార్చి 6 : పట్టణంలోని ఆమనగల్ గ్రామర్ స్కూల్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చక్కటి వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించిన తీరు చూపరులను ఆకట్టుకుంది. విద్యార్థులే అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ ఆమనగంటి సంజీవ్ కుమార్ బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు బికుమాండ్ల ప్రదీప్‌కుమార్, కోట్ల వెంకటేశ్, శైలజ, అవ్వారి శివలింగం, ఉపాధ్యాయులు సుమతి, సమీన్ పాల్గొన్నారు.

# ఆలయాల్లో వైభవంగా బ్రహ్మోత్సవాలు

- మల్లప్ప గుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా గణపతి పూజ, రుద్రహోమం
- పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



తలకొండపల్లి : సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు

తలకొండపల్లి, మార్చి 6 : మండల పరిధిలోని చెన్నారం మల్లప్ప గుట్టపై గల శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలు, విద్యుత్ దీపాలతో శోభాయామానంగా అలంకరించారు. ఉత్సవ ప్రారంభ కార్యక్రమానికి తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారికి మేలుకొలుపు పాడారు. అనంతరం ఆలయ అర్చకుడు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, ఏకవార రుద్రాభిషేకం, పాశుపత రుద్రహోమం, నిర్వహించారు.



ఆమనగల్లు : అయ్యసాగర్ యజ్ఞంలో భక్తులు

పూజల అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మాకం పాండయ్య, ఆలయ కార్యదర్శి కె.మల్లారెడ్డి, నిర్వాహకులు కల్లు పెంటారెడ్డి, దామోదర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శివుడు, అశోక్, నారాయణ రెడ్డి, మల్లారెడ్డి, రామకృష్ణ, పాండురంగారెడ్డి, పాల్గొన్నారు.

**వెల్జాల శ్రీ లక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో**

మండల పరిధిలోని వెల్జాల వేదాద్రి గుట్టపై గల శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల వేడుకల నేపథ్యంలో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం గణపతి పూజ, గోపూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మండపారాధన, ప్రదోశపూజ, సుదర్శనహోమం, సత్యనారాయణస్వామి వ్రతాలు, పుష్పార్చనలను ఆలయప్రధాన అర్చకుడు యాదగిరి నర్సింహశర్మ, శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ అంజాజీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కూనరవి, నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.

**ప్రారంభమైన శివకోటి యజ్ఞం**

ఆమనగల్లు : మండల పరిధి రాంనుంతల గ్రామ సమీపంలోని అయ్యసాగర క్షేత్రంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, భద్రకాళి, సరస్వతి, శ్రీరామాంజనేయ దేవాలయాల్లో బుధవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, శివకోటి యజ్ఞం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలి రోజు స్వామివారికి సుప్రభాతసేవతో మేలు కొలుపు పాడి అనంతరం విఘ్నేశ్వరపూజ, అభిషేకాలు, సర్వదేతాపూజలు, అభిషేకాలు, భగద్గీత పారాయణయాలు, దేవయజ్ఞం, ప్రవచనాలు, భజనలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భట్టు నర్సిరెడ్డి, కర్నాకర్‌రెడ్డి, ఎన్.టి పంచాక్షరి, రామరెడ్డి, వీరయ్య, యాదయ్య, యాదగిరిరెడ్డి, శ్రీను నాయక్, సరితపంతూనాయక్, వైద్యనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లప్ప , పాల్గొన్నారు.

# ప్రజాదీవెన సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



నందిగామ : సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

కేశంపేట, మార్చి 6 : పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ్‌యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన పాలమూరు ప్రజాదీవెన సభకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్ నేతృత్వంలో నాయకులు తరలివెళ్లారు. నాయకులు జగదీశ్వర్, నాయకులు భాస్కర్‌గౌడ్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, యెన్నం మధుసూదన్‌రెడ్డి, రమేష్, మల్లేష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, మనోహర్‌గౌడ్, ఆనందరెడ్డి ఇబ్రహీం, యాదగిరి ఉన్నారు.

నందిగామ : పాలమూరులో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు బుధవారం నందిగామ మండలం నుంచి మండలాధ్యక్షుడు జంగ నరసింహులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వెళ్లారు. మాజీ ఎంపీపీ శివశంకర్



కేశంపేట : సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

గౌడ్, ఎంపీటీసీలు కొమ్ముక్రిష్ణ, ఎంపీటీసీ కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి మాజీ సర్పంచులు పాండురంగారెడ్డి, కావలి కృష్ణ, బుచ్చయ్య, తులసీరాంనాయక్, పాల్గొన్నారు.

ఆమనగల్లు : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పాలమూరులో నిర్వహించిన ప్రజాదీవెన బహిరంగ సభకు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రజాదీవెన సభకు తరలిన వారిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షులు జగన్, బీచ్య నాయక్, ప్రభాకర్ రెడ్డి, నాయకులు చేగూరి వెంకటేశ్, లక్ష్మయ్య, కిషన్, ఉన్నారు.

# ఉచితంగా క్రమబద్ధీకరించాలి

- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, మార్చి 6 : అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌లను రద్దు చేస్తామని ఇచ్చిన మాటకు కాంగ్రెస్ నాయకులు కట్టుబడి ఉండాలని , ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెలాఖరులోపు ఉచితంగా క్రమబద్ధీకరణ చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ పేరిట బీఆర్ఎస్‌ను విమర్శించిన సీఎం రేవంత్ రెడ్డి క్రమబద్ధీకరణ కోసం డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలన్నారు. ఎల్ఆర్ఎస్ విషయంలో బీఆర్ఎస్‌పై విమర్శలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ దీనికి ఇప్పుడేం సమాధానం చెబుతారని వారిని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో తమ పాత్ర ఏమీ లేదని అంజయ్య యాదవ్ అన్నారు. సంబంధిత అధికారులు ఎంపిక చేసిన వారికే ఇళ్ల కేటాయించారని స్పష్టం చేశారు. ఇందులో అనర్హులు ఉంటే వారిని తొలగించాలని చెప్పారు. కేటాయింపులో అవకతవకలు జరగలేదన్నారు.

**కాలువలు ఏర్పాటు చేసి నీళ్లందించండి**

పాలమూరు ప్రాజెక్టు కింద 80 శాతం పనులు పూర్తయాయని, కాలువలు నిర్మించి తాగు, సాగు నీరందించాలని అంజయ్య యాదవ్ సూచించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 5 రిజర్వాయర్‌లు పూర్తి చేశామన్నారు. ఆరో స్థానంలో ఉన్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పూర్తయితే షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని షాద్‌నగర్, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లోని గ్రామాలకు నీళ్ల అందే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జడ్పీ వైస్‌చైర్మెన్ ఈట గణేష్, షాద్‌నగర్ పట్టణ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, పీఏసీఎస్ చైర్మెన్ బక్కన్న, సీనియ్ నేత వంకాయల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మొయినాబాద్, మార్చి 6 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రోహిత్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. బుధవారం మొయినాబాద్ మండల పరిధిలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతోనే యువత మధ్య స్నేహం పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## సన్మార్గంతోనే దైవానుగ్రహం

ఆమనగల్లు, మార్చి 6 : సన్మార్గంలో నడిస్తేనే దైవానుగ్రహం లభిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవాళి సన్మార్గ పురోగమనానికి దోహదపడుతాయని ఆయన చెప్పారు. తోటపల్లి షిరిడి సాయిబాబా దేవాలయాన్ని బుధవారం గోలి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, పోలెపల్లి ఎంపీటీసీ దోనాదుల కుమార్, నాయకులు నిరంజన్ శ్రీను, శ్రీకాంత్, పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

కేశంపేట, మార్చి 6: కేశంపేట మండల సర్వసభ్య సమావేశం నేడు గురువారం నిర్వహిస్తున్నాట్లు ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు వై. రవీందర్ యాదవ్ నేతృత్వంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమావేశానికి హజరు కానున్నారని అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హజరుకావాలని ఆయన కోరారు. ఉదయం 10:30 సమావేశం ప్రారభం అవుతుందని తెలిపారు.

## బాలికలను ఉన్నతంగా చదివించాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 6: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న తరుణంలో తల్లిదండ్రులు బాలికలను ఉన్నత చదువులు చదివించాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ బి.సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, నిత్యం బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు శాలువా కప్పి, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. డీఎం వెంకటనర్సప్ప, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, ఏఈ సత్తయ్య, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వెల్ఫేర్ కమిటీ సభ్యుడు వైవీ రెడ్డి, మల్లికాబేగం తదితరులు న్నారు.



ఒరిగిన యాంటేనా

## ప్రమాదకరంగా యాంటేనా

- పట్టించుకోని అధికారులు

కేశంపేట, మార్చి 6: కేశంపేట మండల పరిషత్ కార్యాలయంపై ఏర్పాటు చేసిన యాంటేనా పక్కకు ఒరిగి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాలనసౌలభ్యంలో భాగంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను, అధికారులతో చర్చించడం, సమాచారం చేరవేడానికి వీడియో కాన్ఫరెన్స్‌ల కోసం ఇది ఉపయోగపడుతుంది. ఇంతటి పాత్ర ఉన్న యాంటినా ఒరిగిపోయినా అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దాన్ని సరి చేయాలని పలువురు కోరుతున్నారు.

## శివపార్వతుల కల్యాణానికి రూ.25,116 విరాళం

తలకొండపల్లి, మార్చి 6 : మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామంలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాలలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి బుధవారం పాల్గొని ఈనెల 8న నిర్వహించే శివపార్వతుల కళ్యాణం కోసం నిర్వాహకులకు రూ.25,116 విరాళం అందజేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డిని సత్కరించి పలువురు అభినందించారు. రేణురెడ్డి, శివ, అంజి, పాల్గొన్నారు.

## అంజనేయ విగ్రహం ఊరేగింపు

మాడ్గుల, మార్చి 6 : మండలంలోని నల్లచెర్వు గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠలో భాగంగా బుధవారం ఆంజనేస్వామి విగ్రహన్ని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగించే వాహనం ఎదుట నీళ్ల పోసి స్వాగతం పలికారు.

## సీనియర్‌సిటిజన్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కొందుర్గు, చౌదరిగూడ, షాద్‌నగర్, మార్చి, 6 : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చౌదరిగూడ మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె మధుసూదన్‌రావు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఊట్ల బాలకిష్టయ్య, అధ్యక్షుడిగా గంగ బస్వరాజ్, ఉపాధ్యక్షుడిగా వేమారెడ్డి, కార్యదర్శిగా కె రాంచంద్రయ్యను ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయ్యగౌడ్, కార్యదర్శి యం సాంబశివరావు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ యూనిట్ కన్వీనర్‌గా రామారావు**

షాద్‌నగర్ సీనియర్ సిటిజన్ యూనిట్ కన్వీనర్‌గా రామారావు ఎంపికయ్యారు. బుధవారం పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో సీనియర్ సిటిజన్ల సమావేశం జరిగింది.

## ఓటుహక్కు వినియోగంపై అవగాహన ఉండాలి

కందుకూరు, మార్చి 6 : ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆకుల మైలారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అరుణ తెలిపారు. బుధవారం పాఠశాలలో లీడర్ ఎన్నికకు విద్యార్థులచే మాక్ పోలింగ్ నిర్వహించారు. ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేయగా జి.సాత్విక్‌కు అత్యధికంగా ఓట్లు వచ్చినట్లు తెలిపారు. దాంతో స్కూల్ లీడర్‌గా సాత్విక్‌కు నియామకపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. టీచర్లు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో శివ స్వాముల ఇరుముడి

షాద్‌నగర్‌రూరల్, మార్చి 6 : ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లిలో శివ స్వాములు భక్తి శ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి కమ్మరి భూపాలాచారి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఇరుముడిలో శివ స్వాముల చేత పంచాక్షరీ మంత్రాన్ని పఠించారు. స్వాములు నర్సింలు, మోహన్, చందు, వీరెందర్‌రెడ్డి ఉన్నారు.

## శివనామస్మరణతో మారు మోగిన సంకేపల్లిగూడ

షాబాద్, మార్చి 6 : మండల పరిధిలోని సంకేపల్లిగూడ గ్రామంలో వెంకటయ్యగౌడ్ స్వామి ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడి పూజ కన్నుల పండువగా బుధవారం జరిగింది. శివస్వాములు పాడిన పాటలు మంత్రముగ్ధుల్ని చేశాయి. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచ్ దర్శన్, మాజీ ఉపసర్పంచ్ రాజేందర్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### గంజాయి కేసులో ముగ్గురి రిమాండ్

- హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి బస్సులో రవాణ
- ఆమనగల్లులో 1.227 కి.లో గ్రాముల గంజాయి లభ్యం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై

ఆమనగల్లు, మార్చి 6 : గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తి, అతనికి సహకరించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 1.227 కిలోగ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్సై బాల్‌రామ్ నాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రమోద్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి పట్టణానికి చెందిన నందిపేట అఖిలేష్ అనే యువకుడు హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో కల్వకుర్తికి గంజాయిని రవాణా చేస్తున్నాడని సమాచారం అందడంతో మంగళవారం రాత్రి ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆ బస్సును తనిఖీ చేయగా అఖిలేష్ వద్ద 1.144 కిలోల గంజాయి లభ్యమైంది. అతన్ని విచారించగా గంజాయి రవాణా చేస్తున్న విషయాన్ని అఖిలేష్ అంగీకరించాడు. అదేవిదంగా అతనికి సహకరించిన కల్వకుర్తికి చెందిన సయ్యద్ నాసర్, చాపల రంజిత్‌ను గుర్తించి వారి వద్ద నుంచి మరో 83 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నందిపేట అఖిలేష్, సయ్యద్ నాసర్, చాపల రంజిత్‌ను అరెస్ట్ చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రమోద్ కుమార్ వెల్లడించారు. ఇదే కేసులో మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గంజాయిని రవాణా చేసినా, విక్రయించినా, సేవించిన వారిపై కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని సీఐ ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై బాల్‌రామ్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ రజనీకాంత్, పోలీసు సిబ్బంది బి.శివకుమార్, శ్రీను, ఎస్. శివకుమార్, మహేందర్, రఘు, ప్రతాప్, జగదీశ్‌ను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐ ప్రమోద్ కుమార్ అభినందించారు.

### మొక్కజొన్న పంటలో గంజాయి సాగు



గంజాయి సాగు చేసిన వ్యక్తితో పోలీసులు

శంకర్‌పల్లి, మార్చి 6 : మొక్కజొన్న పంటలో గంజాయి మొక్కలను పెంచుతున్న ఓ వ్యక్తిని సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన శంకర్‌పల్లి మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రావులపల్లి గ్రామానికి చెందిన సుదీర్(50) తన వ్యవసాయ భూమిలో మొక్కజొన్నపంట చుట్టుపక్కల సుమారు 125 గంజాయి మొక్కలను పండిస్తున్నాడు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. మొక్కజొన్న పంటలో గంజాయి సాగును గుర్తించి సాగు చేస్తున్న సుదీర్‌ను అదుపులోకి తీసుకుని చేవెళ్ల ఎక్సైజ్ పోలీస్‌లకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు స్పష్టం చేశారు.

### లాల్‌పహడ్‌లో ఐదు దుకాణాల్లో దొంగతనం



షాపును పరిశీలిస్తున్న ఎస్సై సక్రం

కొందుర్గు, చౌదరిగూడ, మార్చి, 6 : మండల పరిధి లాల్‌పహడ్‌లోని ఐదు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దొంగతనానికి పాల్పడినట్లు ఎస్సై సక్రం చెప్పారు. ఎస్సై కథనం మేరకు లాల్‌పహడ్‌లోని తిరుమల శ్రీనివాస ట్రేడర్స్‌లో రూ.1.50లక్షలు, శ్రీనివాస పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాపులో 1.20లక్షలు, రాజు గిఫ్ట్ అండ్ నావల్టీస్ షాపులో 20వేలు, రాఘవేందర్ కిరాణషాపులో 6వేలు నగదుతో పాటు సిగరెట్ ప్యాకేట్‌లను ఎత్తుకెళ్లారు. శ్రీశైలం కిరాణషాపు షటర్‌ను విరగ్గొట్టి దొంగతనానికి ప్రయత్నించినట్లు ఎస్సై తెలిపారు. ఐదు దుకాణాల్లో మొత్తం 2.96లక్షల నగదు దొంగతనం జరిగినట్లు చెప్పారు. సీసీ సీసీకెమెరాల హార్డుడిస్కులను దొంగలు ఎత్తుకెళ్లారని, బుధవారం బాధితులు భవనం రాంరెడ్డి, ఆకారపు రామకృష్ణ, రాఘవేందర్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### గోదాంలో అగ్నిప్రమాదం

శంషాబాద్‌రూరల్, 6 : పెళ్లి మంటపాలకు ఉపయోగించే సామానులను ఓ ఫంక్షన్‌హాల్ గదిలో భద్రపరచగా అగ్నిప్రమాదం జరిగిన ఘటన బుధవారం శంషాబాద్ మండలంలోని తొండుపల్లిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వివాహాలకు పెళ్లి మంటపాల కోసం నిర్వాహకులు వీటిని ఉపయోగించుకుని అనంతరం తొలగించి భద్రపరచుకునేవారు. బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటపాలకు మంటలంటుకొని అవి కాలిపోతుండగా ఫైరింజన్‌కు సమాచారమందించారు. ఫైరింజన్ సిబ్బంది మంటలార్పేందుకు ప్రయత్నించినా సామానులన్నీ కాలిపోవడంతో బాధితులు విలపిస్తున్నారు.

### ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారిపై కారు బోల్తా

- ఐదుగురికి గాయాలు

శంషాబాద్ రూరల్, మార్చి 6 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారిపై (రోటరీ 1 వద్ద) ఓ కారు అదుపుతప్పి బోల్తాపడగా ఐదుగురికి గాయలైన సంఘటన బుధవారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డికి చెందిన ఐదుగురు వ్యక్తులు టీఎస్11ఈబ్ల్యూ 8411 కారులో తమ బంధువులను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సెండాఫ్ ఇచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో ఎయిర్‌పోర్టు ప్రధాన రోడ్డుపై కారు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కారులో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు చెప్పారు. సమాచారం అందుకున్న జీఎంఆర్‌రక్ష సిబ్బంది, స్థానిక ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### భవనంపై నుండి పడి తాపీ మేస్త్రి మృతి

ఆదిభట్ల, మార్చి 6 : నిర్మాణంలో ఉన్న ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బ్రిజేష్‌వర్మ భార్య కళావతితో కలిసి ఉపాధి కోసం ఐదు నెలల క్రితం వలస వచ్చి ఆదిభట్లలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. భార్యతో కలిసి ఆదిభట్ల టీసీఎస్ సమీపంలో ఉన్న ఇంటి నిర్మాణ పనులకు వెళ్లేవాడు. కాగా మంగళవారం ఉదయం వెళ్లి పనిచేస్తుండగా సాయంత్రం 4 గంటలకు ప్రమాదవశాత్తు రెండవ అంతస్తులో నుంచి పడిపోయాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తల, వెన్నుపూసకు బలమైన గాయాలు కావడంవల్ల తీవ్ర రక్తస్రావంతో బ్రిజేష్‌వర్మ మార్గమధ్యలోనే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.